నమస్తే తెలంగాణ
# సంగారెడ్డి
I హైదరాబాద్, బుధవారం 10 ఏప్రిల్ 2024 SANGAREDDY

## పాడిపంటలతో కళ కళ లాడాలి



బూరుగుపల్లిలో పంచాంగం వింటున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 9: శ్రీ క్రోధి నామ సంవత్సరంలో అంతా మంచి జరగాలని, పాడిపంటలతో రైతులోకం సుభిక్షంగా ఉండాలని భగవంతుడికి మొక్కుకున్నట్లు ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని బూరుగుపల్లి హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రావణంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అన్నివర్గాల వారికి ఈ ఏడాది కలిసిరావాలని ఆకాంక్షించారు. సమృద్ధిగా వర్షాలు కురిసేలా భగవంతుడు కరుణించాలన్నారు. కార్యక్రమంలో చెలిమేటి రాజు పాల్గొన్నారు. అన్ని గ్రా మాల్లో ప్రధాన ఆలయాల వద్ద పంచాంగ శ్రవణాన్ని వినింపించారు. గజ్వేల్‌లోని సీతారామ ఉమామహేశ్వరాలయంలోపాటు ప్రధాన ఆలయాల్లో పంచాంగ శ్రవణంలో పట్టణవాసులు పాల్గొన్నారు.

## మల్లన్న ఆలయంలో పంచాంగ శ్రవణం



కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో పంచాంగం వినిపిస్తున్న పండితులు

చేర్యాల, ఏప్రిల్ 9: ఉగాది పర్వదినం సందర్భంగా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం లో మంగళవారం ఆలయ వర్గాలు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయంలో ఏఈవో బుద్ది శ్రీనివాస్ ఆధ్వర్యంలో వీరశైవ ఆగమ పండితులు, అర్చకస్వాములు పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్ నూతన సంవత్సరంలో మల్లన్న ఆల య అభివృద్ధి, భక్తుల రాక, స్వామి వారి ఆదాయం తదితర వాటిని వివరించారు. కార్యక్రమంలో పునరుద్ధరణ కమిటీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, సిబ్బంది, అర్చకులు, ఒగ్గుపూజారులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లేవి..!



### పది రోజులుగా నిలిచిన పొద్దుతిరుగుడు కొనుగోళ్లు

- రాష్ట్ర ప్రభుత్వ అనుమతి కోసం ఎదురుచూపు
- మార్కెట్లలో కుప్పలు పోసి ఎదురుచూస్తున్న అన్నదాతలు
- ముగిసిన కేంద్రం వాటా కొనుగోళ్లు
- సిద్దిపేట జిల్లాలో 9,278 ఎకరాల్లో సాగు



గజ్వేల్ మార్కెట్‌లో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న పొద్దు తిరుగుడు కుప్పలు

గజ్వేల్, ఏప్రిల్ 9: ప్రభుత్వం నుంచి అనుమతి రాకపోవడంతో సిద్దిపేట జిల్లాలో పొద్దు తిరుగుడు పంటను మార్కెట్లలో కొనుగోలు చేయడం లేదు. రైతులు పొద్దు తిరుగుడును నిల్వచేసి కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు సిద్దిపేట జిల్లాలో నెలక్రితం ఏడు పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు. మొదట కేంద్ర ప్రభుత్వ వాటా కొనుగోలుకు అనుమతి రావడంతో ప్రారంభించారు. కేంద్రం వాటా పూర్తవడంతో మార్కెట్లలో ఇంకా రైతులు పండించిన పొద్దు తిరుగుడు గింజలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. వారం క్రితం నుంచి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు పంటను ఎలా అమ్ముకోవాలని దిగులు చెందుతున్నారు.

**సిద్దిపేట జిల్లాలో 9,278 ఎకరాల్లో సాగు...**

సిద్దిపేట జిల్లాలో 16వేల మంది రైతులు 9,278 ఎకరాల్లో ఈసారి పొద్దుతిరుగుడు పంట సాగుచేశారు. కేంద్రం వాటాగా 2,029 మెట్రిక్ టన్నుల పొద్దుతిరుగుడు గింజలను కొనుగోలు చేయాలని ఆదేశించింది దీంతో నెలక్రితం జిల్లాలో ఏడు కేంద్రాల్లో కేంద్రాలను ప్రారంభించారు. కేంద్రం వాటా కొనుగోళ్లు పూర్తవడంతో ఆ కేంద్రాలను అధికారులు నిలిపివేశారు. మొదట కేంద్రం వాటాను పూర్తిచేసిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వ వాటా కొనుగోలు కోసం అధికారులు సమయత్తం అవుతారు. వారంరోజులుగా జిల్లాలో కొనుగోళ్లు నిలిచిపోయినా రాష్ట్ర ప్రభుత్వ వాటా కొనుగోలుకు అనుమతి రాకపోవడంతో అటు అధికారులు, ఇటు రైతులు ఎదురుచూస్తున్నారు. కానీ, ప్రభుత్వం నుంచి మాత్రం స్పందన లేదు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 240 మంది రైతుల నుంచి 2900 క్వింటాళ్లను సేకరించారు. మార్కెట్‌లో ఇంకా రైతులు అమ్మకానికి తెచ్చిన 1300క్వింటాళ్ల పొద్దు తిరుగుడు నిల్వ ఉంది. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.4,600 ధర నిర్ణయిస్తుండగా, ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలు ధర రూ.6,760కు అమ్ముకునేందుకు రైతులు కొనుగోలు కేంద్రాలను పంటను తెచ్చారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకునేందుకు రైతులు ఆసక్తి చూపిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వ వాటా కొనుగోలుకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.

**ప్రభుత్వ అనుమతి రాగానే కొనుగోలు**

రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాగానే రైతుల నుంచి పొద్దు తిరుగుడు కొనుగోలు చేస్తాం, కేంద్ర వాటా కొనుగోలు ఇప్పటికే పూర్తయింది. రాష్ట్రం వాటా కొనుగోలుకు అనుమతి కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే వేగంగా ప్రక్రియ పూర్తి చేస్తాం.

–క్రాంతి, మార్క్‌ఫెడ్ అధికారి, సిద్దిపేట

### అప్పట్ల గిట్ల దినుసు ఆగలె..



నేను నాలుగెకరాల్లో పొద్దుతిరుగుడు పండించిన. చిన్నకోడూరులో అమ్ముదామంటే 300 మంది రైతుల ఎనుక నాది లైన్ ఉంది. అక్కడ బార్‌దాన్ దొరుకుత లేదు. సాటేం లేదు. మొగులు చూత్తే సల్ల పడ్డది. అవన్నీ కొన్నంక మనకాడికి వత్తది. ఆలోపు వానపడితే తడత్తది. సిద్దిపేట మార్కెట్లనన్న పోద్దామని ఇక్కడకు వచ్చిన. ఇక్కడ చూత్తే అట్లనే ఉన్నది. ఎక్కడి పొద్దుతిరుగుడు కుప్పలు అక్కడనే ఉన్నయి. షెడ్ల కింద పోస్తే వానొచ్చిన ఏం కాదనుకుంటున్న. కానీ, ఇక్కడ చూస్తే కుప్పలు బాగానే ఉన్నయి. కేసీఆర్ గవర్నమెంట్లల మూడుసార్లు తెచ్చిన. అప్పట్ల గిట్ల ఎప్పుడూ ఆగలె. ఎంబడెంబడి మాల్ పోయింది. ఇబ్బంది లేకుండే.

– ఇట్టవేయిన రాజేశం,రైతు, చిన్నకోడూరు

### వెంటదెంట కొనుగోళ్లు చేయాలి



సిద్దిపేట మార్కెట్ల షెడ్లన్నీ పొద్దు తిరుగుడు కుప్పలతో నిండిపోయినయి. అన్నీ పట్టి రెడీగా ఉన్నాయి. వెంటవెంట కొనుగోలు చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. మిగతా రైతులు, సార్లను తెలుసుకుంటే బార్‌దాన్ ఉంటలేదంటున్నరు. అన్ని సౌలత్‌లు కల్పించి కొనుగోళ్లు తొందరగా పూర్తి చేయాలి. వడ్లు కూడా మార్కెట్‌కు వస్తున్నాయి. జాగా లేక వాళ్లు బయట పోస్తున్నరు. ఒకవేళ వానస్తే తడిసిపోతాయి. పట్టిన వాళ్లయి తీసుకోవాలి.

–రమేశ్, రైతు, గట్లమల్యాల, నంగునూరు మండలం



ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలిపి, నినాదాలు చేస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో హరీశ్‌రావు, ప్రతాప్‌రెడ్డి



కేసీఆర్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి దంపతులు

# కేసీఆర్‌కు ఉగాది శుభాకాంక్షల వెల్లువ

గజ్వేల్/మర్కూక్, ఏప్రిల్ 9: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉగాది శుభాకాంక్షలు తెలిపేందుకు మంగళవారం మధ్యా హ్నం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి జిల్లాలోని గజ్వేల్, సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల నుంచి అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. ఆయా గ్రామాలకు చెందిన పార్టీ ముఖ్యులు, కార్యకర్తలు కేసీఆర్‌ను కలిసేందుకు తరలివచ్చారు. కార్యకర్తలు వేలాదిగా తరలిరావడంతో స్వయంగా కేసీఆర్ బయటకు వచ్చి కార్యకర్తలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మె ల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు జహంగీర్, శ్రీనివాస్ తదితరులు కేసీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**మీ అభిమానానికి ధన్యవాదాలు**

ఉగాది పండుగ శుభకాంక్షలు తెలిపేందుకు ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రానికి వేలాదిగా పార్టీ కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో ఒక్కొక్కరిని కలిస్తే సమయం ఆలస్యమవుతున్న విషయం తెలుసుకొని కేసీఆర్ బయటకు వచ్చారు. పార్టీ కార్యకర్తలు, ముస్లింలకు ఉగాదితోపాటు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ అభిమానానికి ధన్యవాదాలు.. మనమందరం తెలంగాణ సాధించినవాళ్లం ఇక ముందు మన ప్రయాణం చాలా ఉందన్నారు. ఉగాది శుభాకాంక్షలు తెలుపుతూ మీ అందరికీ శుభం కలుగాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. జై తెలంగాణ నినాదాలతో వ్యవసాయక్షేత్రం మార్మోగింది.

**కేసీఆర్‌ను కలిసిన దుబ్బాక నేతలు**

దుబ్బాక, ఏప్రిల్ 9: బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నేతృత్వంలో దుబ్బాక నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మంగళవారం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికి వెళ్లి కేసీఆర్‌ను కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జైతెలంగాణ ..జైకేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డి, దుబ్బాక ఎంపీపీ కొత్త పుష్పలతాకిషన్‌రెడ్డితోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి భారీగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

## యూటర్న్‌ల వద్ద రక్షణేది.?



పటాన్‌చెరు పట్టణ సమీపంలోని రింగ్ రోడ్డుకు వెళ్లే సర్వీస్ రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా పారవేసిన బారికేడ్లు

పటాన్‌చెరు, ఏప్రిల్ 9: రామచంద్రాపురం, పటాన్‌చెరు, రుద్రారం, గణేశ్‌గడ్డ వరకు వెళ్తున్న జాతీయ రహదారిపై పలుచోట్ల యూటర్న్ ఏర్పాటు చేశారు. యూటర్న్‌ల వద్ద వాహనాలు ప్రమాదానికి గురికాకుండా అడ్డంగా బారికేడ్లు సగం రోడ్డు వరకు వేసి రక్షణ కల్పించారు. గత నెల ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఈ బారికేడ్లను తొలిగించి పటాన్‌చెరు పట్టణానికి తరలించి సభ విజయవంతం అయ్యేలా అధికారులు చూశారు. ఆ తర్వాత బారికేడ్లను అక్కడే వదిలేయడంతో అవి పటాన్‌చెరు పట్టణ సర్వీస్ రోడ్డులపై చెల్లాచెదురుగా పడిఉన్నాయి. జాతీయ రహదారిపై డైవర్షన్లు లేకపోవడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. పోచారం చౌరస్తా, హరి దోశ, ముత్తంగి రిలయన్స్ ట్రెండ్స్ వద్ద, ఇస్నాపూర్ సినిమా థియేటర్ వద్ద, లక్డారం గేటు వద్ద రుద్రారం గ్రామం వద్ద బారికేడ్లు లేవు. గీతం యూనివర్సిటీ ఎదుట పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఇటీవల సంగారెడ్డి ఎస్పీ రూపేశ్ జాతీయ రహదారిపై ఉన్న యూటర్న్‌లను ప్రమాదకర స్థలాలను పరిశీలించి, యూటర్న్‌ల వద్ద ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించి వెళ్లినా ఇప్పటివరకు అక్కడి నుంచి తొలిగించిన బారికేడ్లను ట్రాఫిక్ అధికారులు తిరిగి పెట్టలేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

### ఇఫ్తార్ విందుకు
## హాజరైన భూపాల్‌రెడ్డి



కల్హేర్: ఇఫ్తార్ విందుకు హాజరైన మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కల్హేర్, ఏప్రిల్ 9: మండలంలోని కృష్ణాపూర్, మిర్ఖాన్‌పేట్‌లో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ముస్లింలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నర్సింహారెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు అలీ, నారాయణఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ బాషీద్, మాజీ సర్పంచులు కిష్టారెడ్డి, శ్రావణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, పండరి, రాజు, ఇస్మాయిల్, నాందేవ్, శేఖర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

## నేటి నుంచి ప్రచారం

పటాన్‌చెరు, ఏప్రిల్ 9: పటాన్‌చెరులో బుధవారం నుంచి బీఆర్‌ఎస్ మెదక్ అభ్యర్థి తరపున ప్రచారం నిర్వహించనున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలోని సిద్ది వినాయక దేవస్థానంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రత్యేక పూజల అనంతరం దేవస్థానం ఆవరణలో సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, మెదక్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభిస్తారని చెప్పారు.

## ఉద్యోగుల సస్పెన్షన్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 9: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సోమవారం రాత్రి సిద్దిపేటలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఓ రాజకీయ పార్టీ సమావేశంలో పాల్గొన్నందుకు జిల్లాకు చెందిన 106 మంది ప్రభుత్వ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో సెర్ప్ ఉద్యోగులు 38 మంది, వారిలో ఏపీఎంలలు 14 మంది, సీసీలు 18 మంది, వివోఏలు 4, సీబీ ఆడిటర్ ఒకరు, ఉపాధి హామీకి చెందిన 68 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఏపీవోలు 4, ఈసీలు ఏడుగురు, టీఏలు 38 మంది, సీఈవోలు 18 మంది, ఎఫ్ఏ ఒకరు ఉన్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి

**పటాన్‌చెరు పంచాంగ శ్రవణంలో పురోహితులు • హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి**




ఉగాది పంచాంగ శ్రవణానికి హాజరైన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఏప్రిల్ 9: ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని పంచాంగ శ్రవణంలో పురోహితులు తెలిపారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలోని చైతన్యనగర్ హనుమాన్ మందిరంలో జరిగిన ఉగాది వేడుకల్లో ఎమ్మె ల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే కే సత్యనారాయణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురోహితులు పంచాంగ శ్రవణం వినిపించారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురుస్తాయని, చక్కటి పంటలు పండుతాయని తెలిపారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సఫానదేవ్, మాజీ సర్పంచ్ దేవేందర్‌రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, గూడెం మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరామనవమి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ**

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా శ్రీరామనవమి వేడుకల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఏప్రిల్ 15నుంచి 19 వరకు పటాన్‌చెరు పట్టణంలోని శ్రీకోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించి, శ్రీరామ నవమిని ఘనంగా జరుపుకొనేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



శ్రీరామనవమి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితర నాయకులు


# ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలి
- ఉగాది వేడుకల్లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ క్యాంపుకార్యాలయంలో పంచాంగ శ్రవణం వింటున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఏప్రిల్ 9: శ్రీక్రోధి నామ సంవత్సరంలో ప్రజలందరూ సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఉగాది పండుగ సందర్భంగా హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకలు, పంచాంగ శ్రవణం కార్యక్రమంతోపాటు మున్సిపల్ ఆధ్వర్యంలో పట్టణంలోని భవానీ సమిత కాశీమరకత లింగేశ్వరాలయంలో జరిగిన సామూహిక ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఉగాది పచ్చడిని అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కొత్త సంవత్సరంలో హుస్నాబాద్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలన్నారు. ఉగాది షడ్రుచుల్లాగా జీవితంలో కష్టాలు, సుఖాలు, సంతోషాలు కలుగుతుంటాయని, అన్నివేళల్లో అందరితో కలివిడిగా ఉండి ముందుకు పోతే జీవితం సుఖమయంగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, కౌన్సిలర్లు కొంకటి నళినీదేవి, బోజు రమాదేవి, వాల సుప్రజ, కోమటి స్వర్ణలత, వల్లపు రాజు, పున్న లావణ్యసది, గోవిందు రవి, బొల్లి కల్పనశ్రీను, అయిలేని శంకర్‌రెడ్డి, ఎండీ అయూబ్, చిట్టి గోపాల్‌రెడ్డి, ఆకుల వెంకట్, కేడం లింగమూర్తి, పందిల్ల శంకర్, గాదెపాక రవీందర్ పాల్గొన్నారు.



హుస్నాబాద్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

**డివిజన్‌లో ఘనంగా ఉగాది వేడుకలు**

హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల్లో శ్రీక్రోధి నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఇండ్లకు మామిడి తోరణాలు, పూల దండలు కట్టుకొని ఇండ్లలో ప్రత్యేక పూజలు చేశారు. ఉగాది పచ్చడి, భక్షాలు చేసుకొని కుటుంబ సమేతంగా భోజనాలు చేశారు. డివిజన్ పరిధిలోని పలు దేవాలయాలు ఉగాది సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి.